క్లుప్తంగా

లంబాడీల ఐక్యవేదిక జిల్లా కోఆర్డినేటర్‌గా రాజునాయక్



హన్మకొండ: లంబాడీల ఐక్యవేదిక హనుమకొండ జిల్లా కోఆర్డినేటర్‌గా లావుడియా రాజు నాయక్‌ను నియమించినట్లు ఆ ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌కుమార్, చీఫ్ కో ఆర్డినేటర్ గుగులోతు రమేష్‌నాయక్ తెలిపారు. ఐక్యవేదిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్న గుండ్లసింగారం గ్రామానికి చెందిన రాజునాయక్‌కు నియమించినట్లు వారు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాజు నాయక్ మాట్లాడుతూ జిల్లాలో లంబాడీల ఐక్యవేదిక పటిష్టతకు కృషి చేస్తానని తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 28న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీఎస్ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. విద్యానగర్, వాజ్‌పేయి కాలనీ ప్రాంతంలో ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు అశోక కాలనీ, వికాస్‌నగర్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కాజీపేట రైల్వే డీఎస్పీగా కృపాకర్



కాజీపేట రూరల్ : కాజీపేట రైల్వే డీఎస్పీగా తాళ్లపల్లి కృపాకర్ మంగళవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ డీఎస్పీగా కొనసాగుతున్న శ్రీనివాస్‌రావు హైదరాబాద్‌కు బదిలీ కాగా ఆయన స్థానంలో ఖమ్మం నుంచి కృపాకర్ ఇక్కడికి బదిలీపై వచ్చారు. కాజీపేట రైల్వే డీఎస్పీ కార్యాలయంలో కాజీపేట జీఆర్పీ సీఐ ఎం.రాంమూర్తి, వరంగల్ జీఆర్పీ సీఐ నరేష్, ఖమ్మం జీఆర్పీ సీఐ ఏ.వీ.రావు డీఎస్పీ కృపాకర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పూలబొకే అందజేసి స్వాగతం పలికారు.


పోగొట్టుకున్న మొబైల్స్ అప్పగింత

రామన్నపేట : మట్టెవాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో గత నెలలో మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న దేశాయిపేటకు చెందిన మధుసూదన్ సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ అవుట్ చేసి పట్టుకుని మంగళవారం బాధితుడికి అప్పగించినట్లు మట్టెవాడ సీఐ గోపి తెలిపారు. మట్టెవాడ స్టేషన్‌లో ఇప్పటి వరకు 70 మొబైల్స్ కనుగొని పోగొట్టుకున్న బాధితులకు అప్పగించినట్లు పేర్కొన్నారు. మొబైల్ ఫోన్లపై అప్రమత్తంగా ఉండాలని, ఫోన్ పోయినట్లయితే వెంటనే పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సీఐ కోరారు.

ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్‌ను కలిసిన రమేశ్

హన్మకొండ : హనుమకొండ ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ కొంగర జగన్‌ను దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు, తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్పీడీసీఎల్ శాఖ ఉపాధ్యక్షుడు రౌతు రమేష్ కుమార్ కలిశారు. మంగళవారం హనుమకొండ ఆర్టీసీ కాలనీలోని ఇటీవల డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన జగన్‌ను ఆయన మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రమేష్ కుమార్ మాట్లాడుతూ దళిత విద్యార్థులు ఉద్యోగాలు సాధించడంలో ఎస్సీ స్టడీ సర్కిల్ అత్యంత కీలకపాత్ర పోషిస్తుందన్నారు. కలిసిన వారిలో తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకుడు రవి ఉన్నారు.

సీపీని కలిసిన ట్రాఫిక్ ఏసీపీ



వరంగల్ క్రైం : వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన సత్యనారాయణ మంగళవారం వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝాను ఆయన కార్యాలయంలో మార్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ట్రైసిటీ పరిధిలో ట్రాఫిక్ నియంత్రణకు సంబంధించి పలు సూచనలు చేశారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

ఖిలా వరంగల్: వరంగల్ నక్కలపల్లి శివారులోని ఎలగందుల అమృత వృద్ధాశ్రమంలో పుప్పాలగుట్ట బ్యాంక్ కాలనీ చెందిన మల్లారెడ్డి దంపతుల ఆధ్వర్యంలో మంగళవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సేవా భావంతోనే అనాథ వృద్ధులకు అన్నదానం, పండ్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టామని వారు పేర్కొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి
- కాంగ్రెస్‌లో పలువురి చేరిక



పార్టీలో చేరిన యువకులతో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హన్మకొండ చౌరస్తా: పేదలు, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, అభివృద్ధి కేవలం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. నగరంలోని 59, 60 డివిజన్లకు చెందిన పలువురు యువకులు మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. హనుమకొండ విశాల్‌భవన్‌లోని జరిగిన చేరికల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై యువకులకు పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతు ఇందిరమ్మరాజ్య స్థాపన కోసం సీఎం రేవంత్‌రెడ్డి తీసుకొచ్చిన ఆరు గ్యారంటీ పథకాలు ప్రజలకు ఎంతో దగ్గర చేశాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలకు ఆకర్షితులై యువత పార్టీలో చేరుతున్నారని పేర్కొన్నారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ అత్యధిక స్థానాల్లో గెలిపించుకుని రాహుల్‌గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యంగా సమష్టిగా పనిచేద్దామని సూచించారు. కార్యక్రమంలో రవికిరణ్, పున్నంచందర్, సమ్మయ్య, అంకూష్, విష్ణువర్ధన్, సతీష్ పాల్గొన్నారు.

బీజేపీ ఆప్తులను ఏకం చేసేందుకే ఆత్మీయసభ



సమావేశంలో మాట్లాడుతున్న ప్రదీప్‌రావు

కాశిబుగ్గ: బీజేపీ ఆప్తులను ఏకం చేసేందుకే ఈ ఆత్మీయ సభను నిర్వహిస్తున్నామని బీజేపీ రాష్ట్ర నాయకుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు అన్నారు. మంగళవారం పుప్పాలగుట్టలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన ఆత్మీయసభలో ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో వరంగల్ తూర్పు నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగరవేయాలనే సంకల్పంతో నా గెలుపు కోసం అందరూ ఎంతగానో శ్రమించారన్నారు. గెలిచినా ఓడినా మన నినాదం ప్రజల్లోనే ఉండి ప్రజల కోసమే పనిచేయడం. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ గెలిపించి ప్రధాని మోదీకి బహుమతిగా ఇవ్వడమే మన ముందున్న లక్ష్యమన్నారు. కార్యక్రమంలో మాజీ మేయర్ డాక్టర్ రాజేశ్వర్‌రావు, వరంగల్ పార్లమెంట్ ప్రబారి మురళీధర్‌గౌడ్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్, నాయకులు ఎడ్ల అశోక్ రెడ్డి, కుసుమ సతీష్, రత్నం సతీష్ షా, సముద్రాల పరమేశ్వర్, వన్నాల వెంకటరమణ, కనుకుంట్ల రంజిత్, బాకం హరిశంకర్, మార్టిన్ లూథర్ తదితరులు పాల్గొన్నారు.

ఓ సిటీలో ఉచిత డయాబెటిక్ శిబిరం



కాశిబుగ్గ : వరంగల్ సంరక్ష సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత డయాబెటిక్ స్క్రీనింగ్ శిబిరం ఓ సిటీలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి వైద్యులు పలు సూచనలు చేశారు. అనంతరం డాక్టర్ శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ షుగర్ వ్యాధి లక్షణాలను తొలిదశలోనే గుర్తించి చికిత్స తీసుకుంటే ఎన్నో దుష్ప్రభావాలను అధిగమించవచ్చని తెలిపారు. ఈ ఉచిత డయాబెటిక్ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఓటింగ్ శాతం పెంచేందుకు కృషి

- ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా



మాట్లాడుతున్న ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా

హన్మకొండ అర్బన్ : రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు క్యాంపస్ అంబాసిడర్లు కృషి చేయాలని ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా అన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మంగళవారం కలెక్టరేట్‌లో లోక్‌సభ ఎన్నికలు– 2024లో క్యాంపస్ అంబాసిడర్లకు కొత్తగా ఓటర్ల నమోదు, ఓటింగ్ శాతాన్ని పెంచే వివిధ అంశాలపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సమావేశానికి హాజరైన శ్రద్ధా శుక్లా మాట్లాడుతూ గత పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్ పశ్చిమ, పరకాల పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ శాతం తక్కువగా నమోదైందన్నారు. రానున్న ఎన్నికల్లో ఆ పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు ఓటర్లలో చైతన్యం తీసుకురావాలని అంబాసిడర్లకు సూచించారు. అర్హులైన యువతను ఓటర్లుగా నమోదు చేయడంలో కీలకపాత్రను పోషించాలన్నారు. అనంతరం కొత్తగా ఓటర్ల నమోదు, ఓటింగ్ శాతాన్ని పెంచే వివిధ అంశాలపై మాస్టర్ ట్రైనర్లు భాస్కర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి క్యాంపస్ అంబాసిడర్లకు శిక్షణ ఇచ్చారు.కార్యక్రమంలో ట్రెయినీ ఐపీఎస్ శుభం నాగరాలే, డీపీఓ, స్వీప్ నోడల్ ఆఫీసర్ లక్ష్మీరమాకాంత్, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ఎం.హరిప్రసాద్, జిల్లాలోని వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

పార్ట్‌టైం అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలి



ధర్నా చేస్తున్న పార్ట్‌టైం అధ్యాపకులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని పార్ట్‌టైం అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పార్ట్‌టైం అధ్యాపకుల సంఘం ఆధ్వర్యంలో అధ్యాపకులు మంగళవారం కేయూలోని పరిపాలనా భవనం వద్ద బైఠాయించి ధర్నా నిర్వహించారు. ప్లకార్డులు చేబూని నిరసన నినాదాలు చేశారు. వివిధ విభాగాల్లో, వర్సిటీ కళాశాలల్లో 16 పీరియడ్ల వర్క్ లోడును కలిగి ఉన్న పార్ట్‌టైం అధ్యాపకులను కాంట్రాక్టు అధ్యాపకులుగా కన్వర్షన్ చేయాలని, మిగతా అధ్యాపకులకు పీరియడ్‌కు రూ.700ల నుంచి రూ.1000కి రెమ్యూనరేషన్‌ను పెంపుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన కొనసాగించారు. ధర్నాలో కేయూ పార్ట్‌టైం అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ వై.రాంబాబు, బాధ్యులు దేవోజీనాయక్, తిరుణహరిశేషు, భాగ్యమ్మ, మాధవి, నరేందర్‌నాయక్, నవీన్, మౌనిక, యశోదర, మయూరి, శేఖర్, నాగరాజు పార్ట్‌టైం అధ్యాపకులు పాల్గొన్నారు.

‘గృహజ్యోతి’ని సక్రమంగా అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మోహన్‌రావు

మడికొండ: గృహజ్యోతి పథకాన్ని సక్రమంగా అమలు చేయాలని డైరెక్టర్ ఆపరేషన్ మోహన్‌రావు విద్యుత్ సిబ్బందికి సూచించారు. మంగళవారం మడికొండ సబ్‌స్టేషన్ సిబ్బందితో గృహజ్యోతి పథకం అమలుకు తీసుకోవాల్సిన చర్యలను అధికారులకు అవగాహన కార్యక్రమాన్ని మడికొండలోని కరిష్మా గార్డెన్‌లో నిర్వహించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ రిజ్వి ఆదేశాల మేరకు కాజీపేట సబ్ డివిజన్ ఏఈలు, ఫీల్డ్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మోహన్‌రావు మాట్లాడుతూ విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా అత్యవసర సమయాల్లో కూడా ప్రణాళికబద్ధంగా, నిరంతర విద్యుత్ అందించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో హనుమకొండ టెక్నికల్ ఏ.విజయేందర్‌రెడ్డి, ఏడీఈ కాజీపేట నార్ల సుబ్రహ్మణ్యేశ్వరరావు, మడికొండ ఏఈ వాలు నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

ఖాతాల్లో డబ్బులు జమచేయాలి

నయీంనగర్: పార్లమెంట్ ఎన్నికలలోపు దళితబంధు లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు జమచేయాలని లేకుంటే తెలంగాణలోని అన్ని పార్లమెంట్ స్థానాల్లో రెండో విడత లబ్ధిదారులందరు పోటీ చేస్తారని తెలంగాణ రాష్ట్ర దళితబంధు సాధన ఐక్య పోరాట సమితి అధ్యక్షుడు, కన్వీనర్లు కోగిల మహేష్, చిట్టి మల్ల సమ్మయ్య తెలిపారు. మంగళవారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఇప్పటివరకు శాంతియుతంగా కార్యక్రమాలు చేశామని ఇక ముందు పోరాటం ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో రమేష్, రాజేష్, సంజీవ, సంపత్, ప్రశాంత్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

ఏసీపీ దేవేందర్‌రెడ్డికి సన్మానం



హన్మకొండ: హనుమకొండ ఏసీపీ కొత్త దేవేందర్ రెడ్డిని హనుమకొండ జిల్లా రెడ్డి సంఘం నాయకులు సన్మానించారు. మంగళవారం హనుమకొండ సర్క్యూట్ హౌజ్ రోడ్డులోని కార్యాలయంలో ఏసీపీని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపు జయపాల్‌రెడ్డి, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు అర్జుల కిషన్‌రెడ్డి, నాయకులు రాజారపు సంజీవ రెడ్డి, వీసం సురేందర్ రెడ్డి, హరికృష్ణారెడ్డి, కట్కూరి హనుమంత రెడ్డి, మధుకర్ రెడ్డి, పాడి మల్లారెడ్డి, ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.

మంత్రివర్గ ఉపసంఘం హర్షణీయం

- టీఎన్జీఓస్ జిల్లా అధ్యక్షుడు రాజేందర్



మాట్లాడుతున్న ఆకుల రాజేందర్

హన్మకొండ అర్బన్ : జీఓ 317 సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటు చేయడం హర్షణీయమని టీఎన్జీఓస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ అన్నారు. మంగళవారం హనుమకొండ టీఎన్జీఓస్ భవన్‌లో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగుల విభజనలో ఏర్పడిన సమస్యలను అధ్యయనం చేసి వాటి పరిష్కారానికి సిఫారసు చేసేందుకు ప్రభుత్వం జీఓ 292 ద్వారా మంత్రి దామోదర రాజనర్సింహ అధ్యక్షతన మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ సభ్యులుగా మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. స్థానికత కోల్పోయిన ఉద్యోగులకు, వేర్వేరు జిల్లాలకు కేటాయించిన దంపతులకు న్యాయం చేయాలని కోరారు. మార్చి 6వ తేదీన ఆర్ట్స్ కళాశాల ఆడిటోరియంలో జిల్లా స్టాండిగ్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశానికి జిల్లాలోని ఎమ్మెల్యేలు, మంత్రులు, అధికారులను ఆహ్వానిస్తున్నామన్నారు. ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, అసోసియేట్ అధ్యక్షుడు పుల్లూరు వేణుగోపాల్, కోశాధికారి పనికెల రాజేష్, కేంద్ర సంఘ నాయకులు శనిగరపు శ్యాంసుందర్, భూక్యా రామునాయక్, మోయిస్, లక్ష్మీప్రసాద్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

కూలి రేట్లు పెంచాలని నిరసన



వరంగల్: వరంగల్ డాక్టర్స్ కాలనీలోని ధనలక్ష్మీ నవారు, చేనేత కార్యాలయం ఎదుట చేనేత కార్మికులు కూలి రేట్లు పెంచాలని మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. చేనేత కార్మికురాలు సుజాత మాట్లాడుతూ సంఘాల నిర్వాహకులు కనీస కూలి రేట్లు ఇవ్వడం లేదని నేయడం వల్ల కాళ్లు చేతులు నొప్పిగా ఉంటున్నాయని అన్నారు.

విద్యార్థులు ఒత్తిడికి గురికావొద్దు

ఖిలా వరంగల్: పదో తరగతి విద్యార్థులు పరీక్షల సమయంలో మానసిక ఒత్తిడికి గురికాకుండా పట్టుదలతో చదివితేనే ఉత్తమగ్రేడ్ సాధిస్తారని ఆయుర్వేద వైద్యశాల డాక్టర్ మైదం రాజు అన్నారు. మంగళవారం వరంగల్ ఫోర్ట్‌రోడ్డులోని విద్యానగర్ కాలనీలో చాణిక్య విద్యానికేతన్ హైస్కూల్‌లో ప్రిన్స్‌పాల్ వినోద్‌కుమార్, కరస్పాండెంట్ హేమ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు వీ డ్కోలు సమావేశం జరిగింది. ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాస్తున్నట్లుగా భావించాలన్నారు.

నిందితులను అరెస్ట్ చేయాలి

రామన్నపేట : సిద్దిపేట మండలం బక్రి చెప్పల గ్రామంలో జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు వరంగల్ ఆర్యవైశ్య పట్టణ సంఘం అధ్యక్షుడు గుండా ప్రకాశ్, అవోపా అధ్యక్షుడు మల్లాల వీరమల్లయ్యలు పేర్కొన్నారు. మంగళవారం అవోపా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాటాడారు.

శ్వేతార్కుడిని దర్శించుకున్న విజయమ్మ

కాజీపేట: పట్టణంలో కొలువుదీరిన స్వయంభూ శ్రీశ్వేతార్కమూలగణపతి దివ్యక్షేత్రంను మంగళవారం హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ అష్టాదశ లలిత అమ్మవారి ఉపాసకురాలు, శ్రీసమర్థబాల మారుతి సేవా ఆశ్రమ వ్యవస్థాపకురాలు విజయమ్మ దర్శించుకున్నారు. ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకులు ఆలయ సంప్రదాయ రీతిలో స్వాగతం పలికారు.శ్వేతార్కుడి ప్రతిష్ఠాపన, ఉత్సవాలు, పూజలు జరిగే విధానాన్ని ఆలయ పండితులు రాధాకృష్ణ శర్మ వివరించారు.

స్టేట్ లెవల్ కుంగ్‌ఫూ కరాటేలో అఖిల్ ప్రతిభ

మడికొండ: స్టేట్ లెవల్ కుంగ్ ఫూ, కరాటే చాంపియన్‌షిప్‌లో మడికొండకు చెందిన గడ్డం అఖిల్ మొదటి స్థానం పొందాడని కోచ్ రామకృష్ణ తెలిపారు. ఫిబ్రవరి 25న కరీంనగర్‌లో బ్రూస్లీ మార్షల్ ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన టోర్నమెంట్‌లో స్థానిక నవోదయ విద్యానికేతన్‌కు చెందిన అఖిల్ బహుమతి గెలుచుకున్నట్లు తెలిపారు.

మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాలి

ఖిలా వరంగల్: రైతు, కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న కేంద్రంలోని మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి ఆరోపించారు. మంగళవారం వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవన్‌లో బద్రి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక చేయూత



హన్మకొండ: ప్రైవేట్ జూనియర్ కళాశాలలో కామర్స్ అధ్యాపకుడిగా పనిచేస్తూ గుండెపోటుతో మృతి చెందిన మేరుగు సుధాకర్ గౌడ్ కుటుంబానికి స్నేహితులు ఆర్థిక చేయూతనందించారు. మృతుడికి భార్య శ్రీలత, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన మృతితో నిరుపేద కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకుంది. సుధాకర్‌తో పీజీ చదివిన స్నేహితులు విషయం తెలుసుకుని స్పందించారు. మంగళవారం హనుమకొండ రాంనగర్‌లో నివాసం ఉంటున్న కుటుంబ సభ్యులను స్నేహితులంతా కలిసి పరామర్శించి ఆర్థికంగా అండగా ఉంటామని భరోసా కల్పించి రూ.1.50 లక్షలు సాయం అందించారు. తెలంగాణ ప్రైవేట్ లెక్చరర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రెసిడెంట్ పులి శ్రీనివాస్‌గౌడ్, అధ్యాపకులు రూ.50 వేలు, గౌడ అఫీషియల్, ప్రొఫెషనల్ అసోసియేషన్ (గోపా) బాధ్యులురూ.20వేలు ఆర్థికసాయం అందించారు.

సీఐని సన్మానించిన సీనియర్ సిటిజన్స్

హన్మకొండ: కేయూ పోలీస్‌స్టేషన్ హౌజ్ ఆఫీసర్‌గా బాధ్యతలు చేపట్టిన సీఐ చేరాలును సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు సన్మానించారు. మంగళవారం హనుమకొండలోని సీఐని విద్యారణ్యపురికి చెందిన సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు నాగులగాం నరసయ్య, కార్యదర్శి గంగారపు యాదగిరి ప్రతినిధులు శాలువా కప్పి సన్మానించారు.

సఖి బాధిత మహిళలకు అండ

హన్మకొండ చౌరస్తా: వరకట్న, లైంగిక వేధింపులకు గురవుతున్న బాలికలు, మహిళలకు సఖి అండగా ఉంటుందని సఖి వన్ స్టాప్ సెంటర్ కేస్ వర్కర్ వి.వినీల భరోసా కల్పించారు. హనుమకొండ పెద్దమ్మగడ్డలోని పాలెం ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం విద్యార్థినులు, బాలికలకు రక్షణ చట్టాలు– సఖి సేవలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వినీల మాట్లాడారు. బాలికలు, మహిళలు న్యాయసాయం కోసం 0870–2452112 లేదా టోల్ ఫ్రీ నెంబర్ 181కు ఫోన్ చేయాలని అన్నారు.

గంజాయి సరఫరా చేసే వ్యక్తి అరెస్ట్

రామన్నపేట : తెలంగాణ స్టేట్ నార్కోటిక్ బ్యూరో అధికారులు స్పెషల్ ఆరేషన్ చేసి మట్టెవాడ పోలీసుల సహకారంతో మంగళవారం పాపయ్యపేట చమన్ వద్ద గంజాయి సరఫరా చేస్తున్న షేక్ రాజును అదుపులోకి తీసుకున్నారు. ఇతని నుంచి కిలో గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ గోపి తెలిపారు. అలాగే గంజాయి విక్రయిస్తున్న మరో ముగ్గురిని కూడా అదుపులోకి తీసుకున్నట్లు సీఐ పేర్కొన్నారు. షేక్‌రాజును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

పవర్‌లిఫ్టింగ్‌లో మొగిలికి గోల్డ్‌మెడల్

కాజీపేట రూరల్ : కాజీపేట రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఆర్‌పీఎఫ్ సీఐ సంజీవరావు తెలంగాణ స్టేట్ ఓపెన్ లెవెల్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్–2024 పోటీలో గోల్డ్‌మెడల్ సాధించిన సోమిడికి చెందిన దామెరుప్పుల మొగిలిని మెడల్, సర్టిఫికెట్‌తో సన్మానించారు. మొగిలిని మాస్టర్ ఎం.డీ.జాఫర్, పెసరు శ్యాం, మొలుగూరి ఈశ్వర్‌లు అభినందించారు.

జాతర వైఫల్యానికి ప్రభుత్వమే కారణం

ఖిలా వరంగల్: మేడారం సమ్మక్క, సారలమ్మ(వనదేవతల) జాతర వైఫల్యానికి ప్రభుత్వమే కారణమని ఫెస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాదాసు రాజు అన్నారు. వరంగల్ 39వ డివిజన్ ఏకశిలనగర్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా కొంత మంది ఉన్నతాధికారులకు మేడారం జాతర పిక్నిక్‌గా మారిందని ఆరోపించారు. అమ్మవార్ల దర్శనానికి అన్నింటా కష్టాలు ఎదుర్కొన్నారని మండిపడ్డారు.

జనార్దన్‌రావు ఆశయ సాధనకు కృషి చేయాలి



కేయూ క్యాంపస్: ఆదివాసీల ఆత్మబంధువు, బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి ప్రొఫెసర్ బియ్యాల జనార్దన్‌రావు ఆశయాల సాధనకు కృషి చేయాలని పాస్ పూలే ఆశయ సాధన సమితి (పాస్) అధ్యక్షుడు డాక్టర్ సంగాని మల్లేశ్వర్ అన్నారు. వర్ధంతి సందర్భంగా మంగళవారం కేయూ క్రాస్ రోడ్డులోని జనార్దన్‌రావు విగ్రహానికి పాస్ బాధ్యులు పూలమాల వేసి నివాళులర్పించారు.

చంద్రశేఖర్ ఆజాద్‌కు నివాళి

హన్మకొండ చౌరస్తా : స్వాతంత్ర సమరయోధుడు చంద్రశేఖర్ ఆజాద్ 93వ వర్ధంతిని పురస్కరించుకుని 5వ డివిజన్‌లోని హనుమాన్‌గనర్ కాలనీ ఫేజ్–1లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే ప్రొఫెసర్ బియ్యాల జనార్దన్‌రావు 22వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి, రఘుపతి, కుమార్‌రెడ్డి, శ్రీనివాస్, శ్రవణ్, రాజయ్య, వెంకటేష్, రాజ్‌కుమార్, రవికిరణ్, ప్రభాకర్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు అభినందన

కాజీపేట: శ్రీనివాస రామానుజం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన గణితశాస్త్రం పోటీ పరీక్షలో కాజీపేట మండలం సోమిడి శివారులో ఉన్న తాళ్లపద్మావతి ఒలింపియాడ్ పాఠశాల విద్యార్థి కేశవ్ చక్రి మొదటి స్థానం దక్కించుకున్నాడు. హైదరాబాద్ రవీంద్ర భారతిలో మంగళవారం కేశవచక్రికి డాక్టర్ జయప్రకాష్ నారాయణ చేతుల మీదుగా అవార్డును అందుకున్నాడు. కేశవ్‌చక్రితో పాటు జిల్లాలో ప్రతిభ కనబర్చిన అగస్త్య, అద్వైత్, అభిరామ్, సాయిమోక్షిత్‌లను తాళ్ల పద్మావతి విద్యాసంస్థల చైర్మన్ తాళ్ల మల్లేశం అభినందించారు.

పద్మశాలి రాష్ట్ర నాయకుడి మృతికి సంతాపం



వరంగల్ : ఇటీవల అకాల మరణం చెందిన పద్మశాలి సంఘం రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు అంకం వెంకటేశ్వర్లు మరణం చాలా బాధాకరమని ఆ సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఆడెపు రవీందర్ అన్నారు. మంగళవారం పోచమ్మమైదాన్ జంక్షన్‌లో ఏర్పాటు చేసిన సంతాపసభలో వెంకటేశ్వర్లు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ వెంకటేశ్వర్లు వ్యాపారంలో రాణిస్తూ పద్మశాలి సమాజానికి ఎన్నో సేవలు అందించారన్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి



స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేస్తున్న కలెక్టర్

విద్యారణ్యపురి: విద్యార్థులు కష్టపడి చదువుకొని భవిష్యత్‌లో ఉన్నత స్థితిలోకి రావాలని జిల్లా కలెక్టర్ సిక్తాపట్నాయక్ అన్నారు. మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ వరంగల్‌కు చెందిన వారు సామాజిక సేవ కార్యక్రమంలో భాగంగా హనుమకొండ, వరంగల్ ఇంకా వివిధ జిల్లాలకు చెందిన కళాశాలల విద్యార్థినులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం హనుమకొండలోని ప్రభుత్వ పింగిళి మహిళా డిగ్రీ కళాశాలలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో సిక్తాపట్నాయక్ మాట్లాడుతూ మొత్తంగా 25 కళాశాలలకు చెందిన 470 మంది పేద విద్యార్థినులను ఎంపిక చేసి ఒక్కొక్కరికి రూ.6 వేల నుంచి రూ.8 వేల వరకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్‌కిషోర్ ఝా, హనుమకొండ, వరంగల్ డీఐఈఓలు గోపాల్, మాధవరావు,మలబార్ గోల్డ్ డైరెక్టర్ అజీష్ అహ్మద్, అసిస్టెంట్ డైరెక్టర్ జైనుద్దీన్, ప్రిన్సిపాల్ బి.చంద్రమౌళి పాల్గొన్నారు.

ఎల్‌బీ కళాశాలలో ప్రాంగణ నియామకాలు



నియామకపు పత్రాలు అందిస్తున్న ప్రిన్సిపాల్

రామన్నపేట : వరంగల్ ములుగు రోడ్డులోని లాల్‌బహదూర్ కళాశాలలో మంగళవారం జెన్‌ప్యాక్ట్ కంపెనీ ప్రాంగణ నియామకాలు చేపట్టిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ డీహెచ్.రావు తెలిపారు. ఈ నియామకాల్లో దాదాపు 300 మంది పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నియామకపు పత్రాలను అందించారు. కార్యక్రమంలో జెన్‌ప్యాక్ట్ హెచ్ఆర్ రాఘవ, ప్లేస్‌మెంట్ సెల్ కన్వీనర్ శృతి, రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.